72 గంటలు అప్రమత్తంగా ఉండాలి

- అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలి
- ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు
- అవసరమైతే విద్యాలయాలకు సెలవులు
- ఐటి ఉద్యోగుల వర్క్ ఫ్రమ్‌హోంకు చర్యలు : సిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాబోయే 72 గంటలపాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు, వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం సాయంత్రం తెలంగాణ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సిఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని కోరారు. ఉద్యోగులు, సిబ్బంది సెలవులను రద్దు చేశారు. పరిస్థితులను బట్టి అవసరమైతే విద్యాలయాలకు ఒకట్రెండు రోజులు సెలవులు ఇవ్వాలని సూచించారు. ఐటీ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేసేందుకు ఉన్న అవకాశాలపై ఆ కంపెనీల యాజమాన్యాలతో చర్చించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించారు.

"లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. ఎక్కడ ఏం జరిగినా సమాచారం కంట్రోల్ రూం కు చేరేలా చూడాలి. ముంపు ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఎక్కడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగడానికి వెళ్లేదు. సహాయక చర్యలకు అవసరమైన నిధులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. విద్యుత్ శాఖ అధికారులు మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచుకోవాలి. డ్రైనేజ్ వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. అత్యధిక వర్షాలు పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలి. గతంలో ఊహించని విధంగా ఖమ్మంలో రెండు గంటల్లో 42 సెం.మీ వర్షం పడింది. అలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తితే ఎలాంటి తప్పులు మళ్లీ నష్టం జరకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు, సిబ్బంది సెలవులు రద్దు చేసి 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. హైదరాబాద్‌లో ప్రమాద స్థాయికి నీరు చేరిన చోట ప్రజలు వెళ్లకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తం చేయాలి. వర్షాల నేపథ్యంలో మూడు కమిషనరేట్ లలో ట్రాఫిక్ నియంత్రణకు లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారం తీసుకోవాలి. వర్షాలు, వరదల పరిస్థితిపై ఎప్పటికప్పుడు ఎఫ్‌ఎం రేడియోలలో ఎప్పటికప్పుడు అలర్ట్ చేయాలి. 24 గంటల్లో 2 సెంటిమీటర్ల వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణాలు నిర్మాణం అయ్యాయి. క్లౌడ్ బరస్ట్ సమయాల్లో పరిస్థితులను ఎదుర్కొనేలా సన్నద్ధం కావాలి. పరిస్థితులను బట్టి స్కూళ్లు, కాలేజీలకు సెలవులు ప్రకటించాలి. సాధ్యమైనంత వరకు రోడ్లపై ట్రాఫిక్ తక్కువగా ఉండేలా చూడాలి. అత్యవసర టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి. మీడియా తప్పుడు వార్తలతో భయానక వాతావరణం సృష్టించే ప్రయత్నం చేయకుండా సమాచార శాఖ ఎప్పటికప్పుడు మీడియాకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలి. రాబోయే 72 గంటలు అన్ని విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండి సమన్వయంతో పని చేయాలి.." అని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సిఎం రేవంత్

అధికారుల మధ్య నిరవధికంగా కమ్యూనికేషన్ ఉండేలా అత్యవసర గ్రూప్‌లను ఏర్పాటు చేసి జట్టుగా పరిస్థితులను ఎదుర్కోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఏదైనా జిల్లాలో అధిక వర్షపాత సూచనలు ఉంటే ఆయా ప్రాంతాలపై అవగాహన ఉన్న సీనియర్ అధికారులను అక్కడి పర్యవేక్షణకు ఉపయోగించాలని కోరారు. పట్టణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాలకు హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితిలో తక్షణ చికిత్స అందించేందుకు వీలుగా వైద్యులు, ఔషధాలు ఇతర ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని వైద్యారోగ్యశాఖ అధికారులకు సూచించారు

కాటియోకు రూ.26 కోట్ల నిధులు

బెంగళూరు: అంకిత్ ఆచార్య నేతృత్వంలోని కాటియో కొత్తగా రూ.26 కోట్ల (3మిలియన్ డాలర్లు) నిధులు సమీకరించినట్లు తెలిపింది. అమల్ పారిఖ్ ఆధ్వర్యంలో ఈ రౌండ్‌లో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, వెంచర్ క్యాటలిస్ట్స్, విభా చేతన్, రవీన్ శాస్త్రి, వివేకానంద హల్లెకెరె, నిశ్చయ్ ఏజీ పాల్గొన్నారు. ఈ నిధులను రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ బలోపేతం, సాంకేతిక విస్తరణకు ఉపయోగించనున్నట్లు ఆ సంస్థ సిఇఒ అంకిత్ ఆచార్య తెలిపారు. రోడ్ భద్రత ఎఐ సేవలను అందించే తమ సంస్థ 46 నగరాలలో 60 పైగా కస్టమర్లతో పనిచేస్తోందన్నారు.

ఎకో టూరిజంపై దృష్టి పెట్టండి

- వన్యప్రాణుల కదలికలు కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం
- అధికారుల ప్రమోషన్లు, అవార్డులకు ప్రతిపాదనలు పంపండి : సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని అటవీశాఖ అధికారులను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అడవుల్లో వన్య ప్రాణుల సంరక్షణ, వాటి కదలికలను గమనించేందుకు ఏర్పాటు చేసిన కెమెరాలన్నింటినీ హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంట్రల్‌లో అటవీశాఖపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అందులో రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ముఖ్యమంత్రి ఒఎస్‌డి వేముల శ్రీనివాసులు, పిసిసిఎఫ్ డాక్టర్ సి.సువర్ణ, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఎలుసింగ్ మేరు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సింగపూర్ వంటి దేశాల్లో 30 ఎకరాల్లోనే నైట్ సఫారీలున్నాయని గుర్తుచేశారు. మన దగ్గర భారీ విస్తీర్ణాల్లో అటవీ ప్రాంతాలు, అందులోనే నదులు, జలపాతాలు ఉన్నా ఎందుకు ఆ స్థాయిలో విజయవంతం చేయడం లేదని ప్రశ్నించారు. ఆ వనరులను సద్వినియోగం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులున్నా తెలంగాణ వాసులు ఇతర రాష్ట్రాల్లోని బందీపూర్, తడోబా వంటి ప్రాంతాలకు పులుల సందర్శనకు వెళ్తుండటాన్ని ప్రస్తావించారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులకు సందర్శకుల సంఖ్య పెంచేలా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య భూ వివాదాల పరిష్కారానికి సంయుక్త సర్వే చేపట్టాలనీ, ఆ విషయంలో కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వరంగల్ కాకతీయ జూ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో పెద్ద నగరమైన వరంగల్‌లో జూను ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేయాలన్నారు. అటవీ జంతువుల దాడిలో మరణించిన, గాయపడిన వారికి, పశువులు, పెంపుడు జంతువులు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దానికి సిఎంఆర్‌ఎఫ్ నుంచి అవసరమైన మేరకు నిధులు వినియోగించుకోవాలని సూచించారు. అటవీ శాఖలో అధికారుల కొరతపై ఆరా తీశారు. రాష్ట్రానికి తగిన సంఖ్యలో ఐఎఫ్‌ఎస్ అధికారుల కేటాయింపుపై కేంద్రంతో సంప్రదించాలని సీఎస్‌కు సూచించారు. అటవీ శాఖలో ప్రమోషన్లు, ఉద్యోగాల భర్తీకి సంబంధించిన ప్రతిపాదనలను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. శాఖలో ఉత్తమ పని తీరు కనబర్చుతున్న వారికి అవార్డులను ఇచ్చే ప్రక్రియను పునరుద్ధరించాలని నొక్కి చెప్పారు. అటవీ శాఖ పరిధిలో చేపడుతున్న రహదారులు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖ, ఆయా పనులు చేపడుతున్న శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నుంచి సాధ్యమైనంత త్వరగా అనుమతులను సాధించాలన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న సిఎం రేవంత్

సెంట్రల్ డిజైన్ విభాగాన్ని పటిష్టం చేస్తాం

- ఆధునిక పరిజ్ఞానాన్ని అమలు చేస్తాం
- ఇంజనీరింగ్ నిపుణుల నియామకం
- పూర్తిస్థాయిలో సంస్కరణలు : మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటిపారుదల శాఖ సెంట్రల్ డిజైన్ విభాగం పటిష్ఠతకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడిగడ్డ ఉదంతంలో జాతీయ భద్రత సంస్థతో పాటు జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ చేసిన వ్యాఖ్యలతో సిడిఒ ప్రతిష్ట దెబ్బతిన్నదని ఆయన వ్యాఖ్యానించారు. వీటిపై సిడిఒ పున్నసమీక్షించుకుని సంస్కరణలు చేపట్టడం అత్యవసరమని చెప్పారు. ఇందుకు అవసరమైనా రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్సీలు అంజద్ హుస్సేన్, రమేష్‌బాబుతో పాటు నీటిపారుదల శాఖ సంయుక్త కార్యదర్శి కె శ్రీనివాస్, సిడిఒ సిఇ ఎం సత్యనారాయణరెడ్డి, సిఇలు అజయ్‌కుమార్, మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా డిజైన్ల విభాగాన్ని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ముఖ్యంగా ప్రాజెక్టు డిజైన్ల రూపకల్పనలో ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అందుకు అవసరమైన తాజా సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో ముందుండాలని చెప్పారు. ఒకప్పుడు సిడిఒ తెలుగు రాష్ట్రాలతో పాటు యావత్ భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి మొదలెడితే తెలుగురాష్ట్రాలలో నిర్మించిన ప్రధాన ప్రాజెక్ట్ నిర్మాణాలలో వినియోగించిన సాంకేతికత తెలంగాణ సిడిఒ ప్రతిభకు పట్టం కడుతుందన్నారు. అలాంటి ప్రతిభ చాటుకునేందుకు సిడిఒ కృషి చేయాలని హితవు పలికారు. అలాంటి విశ్వసనీయత గలిగిన సంస్థకు ఎట్టి పరిస్థితుల్లోనూ నష్టం జరగకుండా చూస్తామని, లోపాలు సరిచేసి అదే ప్రతిష్టను ఇనుమడింప చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదే సమయంలో సిడిఒలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి తక్షణం చర్యలు తీసుకుంటున్నట్టు ప్రకటించారు. అన్నీ స్థాయిల్లో ఉద్యోగాల భర్తీ చేపట్టడం సంస్థను బలోపేతం చేయడంలో బాగమేనని గుర్తుచేశారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఐఐటి హైదరాబాద్, జెఎన్‌టియు, టిఎస్ జెన్‌కో వంటి సంస్థలకు చెందిన వారిని నియమించే ముందు టైంబౌండ్ పద్ధతిలో డిజైన్ల రూపకల్పన, ఉత్తమ నైపుణ్యాలను ప్రదర్శించడంతో పాటు సమయపాలనకు పెద్ద పీట వేయాలన్నారు.

నెల్లికల్లు, డిండి ఎత్తిపోతల పథకాలపై

నల్లగొండ జిల్లాలో నెల్లికల్లు, డిండి ఎత్తిపోతల పథకాల డిజైన్లను త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి చెప్పారు. ఆలస్యమయ్యే కొద్దీ రైతులకు నీరు అందించడంలో జరుగుతున్న జాప్యం దృష్టిలో పెట్టుకుని డిజైన్లకు తక్షణం ఆమోదించాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించారు.


నెట్‌వర్క్‌ను తనిఖీ చేస్తున్న ముషారఫ్ ఫరూఖీ

బస్తీల్లో భద్రతకు ప్రాధాన్యత

- టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ బస్తీల్లో నిరంతర విద్యుత్ సరఫరాకు తోడు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అధికారులకు సూచించారు. అవసరానికి మించి కట్టలు కట్టలుగా కిందికి వేలాడుతూ బాటసారులు, విద్యుత్ సిబ్బందికి అపాయకరంగా పరిణమించిన కేబుళ్లను తొలగించాలని చెప్పారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా బస్తీలు, కాలనీల్లో ఇళ్ల ముందు ప్రమాదకరంగా ఉన్న ఎల్‌టీ నెట్‌వర్క్ ఓవర్ హెడ్ లైన్లను ఎయిర్ బంచెడ్ కేబుల్‌తో మార్పిడి కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్ సర్కిల్ పరిధిలోని మోతీనగర్, ఇందిరానగర్ బస్తీ, హెచ్‌ఎఫ్ నగర్ బస్తీ, బోరబండ సైట్ 2 బస్తీలోని పలు వీధుల్లో మంగళవారం ఆయన కాలినడకన తిరుగుతూ, ఎల్‌టి నెట్‌వర్క్‌ను తనిఖీ చేసిన సిఎండి స్థానిక ప్రజలతో మాట్లాడారు. తమ సంస్థ పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్లకు దగ్గరగా ఉన్న ఓవర్ హెడ్ లైన్ స్థానంలో ఎబి కేబుల్‌ను అమర్చడం పట్ల బస్తీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. సిఎండి వెంట సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డాక్టర్ నర్సింహులు, మెట్రో జోన్ చీఫ్ ఇంజనీర్ ప్రభాకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కరుణాకర్‌బాబు, డివిజనల్ ఇంజినీర్ భీమా నాయక్ అధికారులు ఉన్నారు.

జన్యుపర లోపం.. పామాయిల్ రైతుకు అపార నష్టం

- ఆరు ఎకరాల్లో చెట్లు తొలగింపు
- ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వైఎస్ బంజరలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


జెసిబితో పామాయిల్ చెట్లు తొలగిస్తున్న రైతు

జన్యుపర లోపంతో నాలుగేళ్లు అయినా పామాయిల్ చెట్లకు గెలలు రాకపోవడంతో ఓ రైతు తన ఆరు ఎకరాల్లోని చెట్లను జెసిబితో మంగళవారం తొలగించారు. దాంతో ఆ రైతు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వైఎస్ బంజరలో చోటుచేసుకుంది. బాధిత రైతు చక్రధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగేళ్ల క్రితం నాలుగు ఎకరాల్లో పామాయిల్ మొక్కలు వేయగా, కొన్ని రోజులకే అవి నకిలీవని తేలినట్టు చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల ద్వారా రాష్ట్ర శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్లగా.. వారు వచ్చి పరిశీలించి జన్యుపర లోపమని చెప్పి వెళ్లిపోయారన్నారు. రోజులు గడుస్తున్నా ఆయిల్‌ఫెడ్ అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 80 శాతం చెట్లకు గెలలు రాలేదన్నారు. 2020 సంవత్సరంలో మూడో క్వాలిటీ సీడ్‌ను దిగుమతి చేసుకోవటం, నర్సరీల్లో పెంచిన మొక్కలు 60 శాతం వరకు నాణ్యత లేనివని, గతంలో అధికారులు ఆఫ్ టైప్ మొక్కలను కల్లింగ్ చేయకుండా రైతులకు ఇవ్వటం వల్లే ఇలా జరిగిందని ఆరోపిస్తున్నాడు. ఏండ్ల తరబడి ఆయిల్ ఫెడ్ అధికారులు, శాస్త్రవేత్తల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేదని, ఎంత కాలం ఎదురు చూడాలని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు ఒక పక్క కాపు రప్పిస్తామని చెప్పటమే కానీ అందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. రోజు రోజుకు పెట్టుబడులు అధికమవుతున్నాయని, ఆర్థికంగా తనకు భారంగా మారిందని, తప్పనిసరి పరిస్థితుల్లో పామాయిల్ చెట్లను జెసిబితో తొలగించాల్సి వచ్చిందని, దాంతో తాను తీవ్రంగా నష్టపోయినట్టు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈతకు వెళ్లి కవలలు మృతి

- కామారెడ్డిలో విషాదం

హైదరాబాద్ బ్యూరో : ఈతకు వెళ్లి కవలలు మృతిచెందిన ఘటన కామారెడ్డి జిల్లా కామారెడ్డి మండలం తిమ్మప్పపల్లి గ్రామంలో సోమవారం జరిగింది.స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్రాల పెద్ద నర్సింలు మంజుల దంపతులకు రాము, లక్ష్మణ్ (13 సంవత్సరాలు) కవలలు సంతానం. అదే గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్ స్కూలులో 8వ తరగతి చదువుతున్నారు. స్కూలు అయిపోయాక ఇంటికి వచ్చిన వారు.. ఈత కొట్టేందుకు గ్రామ శివారులోని కుంటకు వెళ్లారు. కుంటలో లోతు ఎక్కువగా ఉండటంతో నీట మునిగి మృతిచెందారు. కాగా, కవలల తండ్రి నర్సింలు రోజువారీ మేస్త్రీగా పని చేస్తుండగా, మంజుల బీడీలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇద్దరు కొడుకులు మరణించడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రచయిత్రి అనిశెట్టి రజిత మృతి

- కెఎంసికి భౌతికకాయం అప్పగింత
- ప్రజాస్వామ్యవాదులకు తీరని లోటు : సిపిఎం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో



ప్రముఖ రచయిత్రి, అఖిల భారత ప్రజా రచయిత్రుల సంఘం అధ్యక్షులు అనిశెట్టి రజిత (65) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం అంతిమయాత్ర నిర్వహించి.. ఆమె భౌతికకాయాన్ని వరంగల్‌లోని కెఎంసికి అప్పగించారు. అంతిమయాత్రలో కవులు, రచయితలు, మేధావులు, ఆయా రాజకీయ పార్టీల నేతలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. హనుమకొండ రెడ్డికాలనీలోని స్వగృహంలో ఆమె భౌతికకాయాన్ని సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, తదితరులు సందర్శించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ.. అనిశెట్టి రజిత రచనలు ప్రజలను చైతన్య పరిచేవని, రచయిత్రిగా వందలాది కవితలు, ఉపన్యాసాలు చేశారని అన్నారు. ఆమె మరణం ప్రజాస్వామ్యవాదులకు తీరని లోటని, సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆమె మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రమాదేవి, రచయితలు విద్యా దేవి, డాక్టర్ చంద్రబాను, బన్న ఐలయ్య, అవయవ దాన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

రచయిత్రి అనిశెట్టి రజిత మృతి పట్ల మంత్రి సీతక్క దిగ్భ్రాంతి

ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత మరణం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత మృతికి నవతెలంగాణ చీఫ్ జనరల్ మేనేజర్ పి ప్రభాకర్, ఎడిటర్ రాంపల్లి రమేశ్ సంతాపం ప్రకటించారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. సామాజిక చైతన్యం కోసం ఆమె చేసిన కృషిని గుర్తుచేశారు. ఆమె మరణం సామాజిక పోరాట శక్తులకు తీరని లోటు అని పేర్కొన్నారు. ఆమె మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనిశెట్టి రజిత మృతికి తెలంగాణ సాహితీ సంతాపం

ప్రసిద్ధ రచయిత్రి, కవయిత్రి అనిశెట్టి రజిత అకాల మరణం సాహిత్య రంగానికి తీరని లోటు అని తెలంగాణ సాహితీ రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన, కార్యదర్శి కె ఆనందాచారి, రాష్ట్ర నాయకులు మోహన్‌కృష్ణ, సలీమా, తంగిరాల చక్రవర్తి పేర్కొన్నారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. మంగళవారం ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో గంజాయి పట్టివేత

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో 13.3 కేజీల గంజాయిని అధికారులు పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎయిర్‌పోర్టులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు తనిఖీలు చేయగా.. మంగళవారం ఓ మహిళ వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌జిఐఎ అవుట్ పోస్ట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బ్యాంకాక్ నుంచి వచ్చిన భారతీయ ప్రయాణికురాలిని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ), హైదరాబాద్ జోన్ యూనిట్ అధికారులు అడ్డుకున్నారు. చెక్ ఇన్ బ్యాగేజీలో భాగంగా ప్రయాణికురాలి బ్యాగ్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అందులో ఆకుపచ్చ ముద్ద పదార్థాన్ని కలిగి ఉన్న 20 ప్యాకెట్లు గుర్తించారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని క్షేత్ర పరీక్ష చేయగా.. అది గంజాయి అని తేలింది. దాదాపు 13.3 కిలోలు ఉన్న ఆ పదార్థం మార్కెట్లో సుమారు రూ.13.3 కోట్ల విలువ ఉంటుందని అధికారుల అంచనా. మహిళ వెంట తీసుకువచ్చిన ప్యాకేజింగ్ మెటీరియల్‌తో పాటు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమెని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోఫిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం 1985 నిబంధన కింద అరెస్టు చేసి, జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పీపుల్ టెక్ 'థింక్స్' ప్రారంభం

హైదరాబాద్ : టెక్నాలజీ కంపెనీ పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ తమ మాస్ వేదికలో భాగంగా ఎఐ ఆధారిత ఎలక్ట్రిక్ ద్వి చక్రాల వాహన బ్రాండ్ థింక్స్‌ను అందుబాటులోకి తేనుంది. దీనిని మాదాపూర్‌లో తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి డి శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నదెండ్ల మనోహర్, ఎపి ఇండస్ట్రీస్ మంత్రి టిజి భారత్ లాంచనంగా ఆవిష్కరించారు. ఎఐ ఆధారిత థింక్స్ ఉత్పత్తి తయారీకి రూ.800 కోట్ల పెట్టుబడులు అవసరం కావొచ్చని పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ సిఇఒ టిజి విశ్వప్రసాద్ పేర్కొన్నారు. థింక్స్‌తో తాము కేవలం ఒక వాహనాన్ని ఆవిష్కరించడమే కాదని.. ఒక ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామన్నారు. 2027 చివరి నాటికి ఉత్పత్తిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

విలువలకు నిదర్శనం 'నవతెలంగాణ'

- జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవతెలంగాణ దినపత్రిక తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని పదో సంవత్సరంలో అడుగుపెట్టిన సందర్భంగా దాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్న యాజమాన్యం, సిబ్బంది, విలేకర్లు, కార్మికులందరికీ జస్టిస్ సుదర్శన్ రెడ్డిఅభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్థంభం ప్రసార మాధ్యమమని చెప్పారు. పత్రికలన్నీ తమ ప్రతిష్టను కోల్పోతున్న సందర్భంలో నవతెలంగాణా లాంటి కొన్ని పత్రికలు ఇంకా విలువలు పాటిస్తూ పాత్రికేయ రంగానికి చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. నెహ్రూను ఒకప్పుడు పత్రికలు లేని ప్రజాస్వామ్యం కావాలా? అని ప్రశ్నిస్తే.. పత్రికలున్న ప్రజాస్వామ్యమే కావాలన్నారని గుర్తు చేశారు. పత్రికలు లేకుంటే ప్రజాస్వామ్యమే అక్కరలేదని తెలిపినట్టు పేర్కొన్నారు. అందుకు భిన్నంగా ఇప్పుడు చాలా విచిత్రమైన పరిస్థితులను చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా దిగజారిపోయిన విలువలు ఉన్నాయనీ, ఈ ప్రస్థానం ఎటువైపో తమలాంటి వాళ్లకు అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే నవతెలంగాణ చేస్తున్న కృషి ఆ తిరోగమనాన్ని ఆపగలిగేందుకు ప్రయత్నించడం అభినందనీయమన్నారు.

నిస్సాన్ 'మాగ్నైట్' పదేళ్ల వారంటీ

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆటోమొబైల్ కంపెనీ నిస్సాన్ మోటార్ ఇండియా తన కొత్త నిస్సాన్ మాగ్నైట్‌కు పది సంవత్సరాలు పొడిగించిన వారంటీ ప్రణాళికను ప్రారంభించినట్లు తెలిపింది. ఇది దేశంలోని ఎస్‌యువి విభాగంలో తొలిసారి అని పేర్కొంది. అక్టోబర్ 2024 తర్వాత వాహనాలకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ఈ ప్లాన్‌లో వారంటీని 10 సంవత్సరాలు లేదా 2,00,000 కిలోమీటర్ల వరకు వర్తించనుంది. రోజుకు రూ.12 నుండి వ్యయంతో ప్రారంభమవుతుంది. "కొత్త నిస్సాన్ మాగ్నైట్ భారతీయ కస్టమర్లకు నాణ్యత, విశ్వసనీయత, భద్రతను అందిస్తుంది. పదిసంవత్సరాల వారంటీ కస్టమర్లకు మనశ్శాంతి, దీర్ఘకాలిక విలువను నిర్ధారిస్తుంది." అని ఆ కంపెనీ ఎండి సౌరాబ్ వాట్సా తెలిపారు.

ఫార్మా కోల్డ్ సప్లై చైన్‌లోకి సెల్సియస్ లాజిస్టిక్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ సాంకేతిక-ఆధారిత 3పిఎల్ కోల్డ్ సప్లై చైన్ ప్రొవైడర్ సెల్సియస్ లాజిస్టిక్స్ కొత్తగా ఔషధాల సరఫరా కోసం సెల్సియస్ ప్లస్ విభాగాన్ని ప్రారంభించినట్లు తెలిపింది. ఈ విభాగం వ్యాక్సిన్‌లు, బయోలాజిక్స్, ఇన్సులిన్, స్పెషాలిటీ ఔషధాల రవాణాకు ఉష్ణోగ్రత నియంత్రణ, రియల్ టైమ్ ట్రాకింగ్‌తో కూడిన సాంకేతిక పరిష్కారాలను అందిస్తుందని సెల్సియస్ సిఇఒ స్వరూప్ బోస్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందుకోసం తొలిదశలో రూ. 50 కోట్ల పెట్టుబడి పెట్టడం ద్వారా 18 నెలల్లో రూ.100 కోట్ల రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రూ.35 కోట్లతో 100 రీఫర్ వాహనాలు, రూ. 10-15 కోట్లతో ఫార్మా కొరియర్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నామన్నారు. 2025 చివరి నాటికి 100 పైగా నగరాలు, ప్రముఖ ఫార్మా కంపెనీలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

కనీస వేతన జిఓలు సవరించాలి

- సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె కుమారస్వామి
- కార్మిక శాఖ ఎదుట నిరసన
- డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 73వ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌కు సంబంధించిన కనీస వేతనాల జిఒలను వెంటనే సవరించాలని సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె కుమారస్వామి డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2021లో కనీస వేతనాలను సవరిస్తూ ఐదు ప్రిలిమినరీ జిఒలను విడుదల చేసిందని, కానీ యాజమాన్యాల ఒత్తిడితో ఆ జిఒలను గెజిట్ చేయకుండా అలాగే తొక్కి పెట్టి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. చట్టం ప్రకారం కనీస వేతనాల జిఒలను ఐదేళ్లకోసారి సవరించాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల అనేక జిఒలు 15 ఏళ్లుగా ఎలాంటి సవరణకూ నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆ షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేసే కార్మికులకు 15 ఏళ్ల కిందట నిర్ణయించిన వేతనాలనే ఇప్పటికీ ఇస్తున్నారని తెలిపారు. రోజురోజుకూ ధరలు పెరుగుతున్నా.. వేతనాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం మూలంగా కార్మికవర్గం అనేక ఇబ్బందులకు గురవుతున్నదన్నారు. కనీసం వేతనాల సలహా మండలి ఇచ్చిన సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం, క్యాబినెట్ సబ్ కమిటీ పరిగణలోకి తీసుకోకుండా కాలయాపనక చేస్తున్నాయన్నారు. 2021లో విడుదల చేసిన షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ ఐదు ప్రిలిమినరీ జిఒలకు యథాతథంగా గెజిట్ విడుదల చేయాలని, మిగిలిన 68 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జిఒలను సవరించి కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల సవరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన అనేక తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. జీవోలను వెంటనే సవరించాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నాయకులు కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ జాసన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం శ్రావణ్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ ఉపాధ్యక్షులు ఆర్ అశోక్, జి రాములు, టి మహేందర్, సి మల్లేష్, డిఎల్ మోహన్, జిల్లా కమిటీ సభ్యులు జగదీష్, ఎ రాజు, నాయకులు కె జంగయ్య, జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ నాయకులు రాజు, హెచ్‌ఎండిఎ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

జల రాజకీయం

- కాళేశ్వరం నివేదికతో మరింత ఊతం
- అసెంబ్లీలో చర్చించాకే చర్యలు
- కమిషన్ నివేదికను అడిగిన హరీష్
- అధికార, ప్రతిపక్షం ఢీ అంటే ఢీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. రోజురోజుకు కాళేశ్వరం కమిషన్ నివేదిక అగ్గి రాజేస్తున్నది. అధికార, ప్రతిపక్షం మధ్య ఢీ అంటే ఢీ అనే పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. పోటాపోటీగా స్పందిస్తున్నాయి. కాళేశ్వరం బ్యారేజీలపై దాదాపు ఏడాదిన్నరపాటు విచారించిన పిసి ఘోష్ కమిషన్ ఇటీవల సర్కారుకు నివేదికను అందజేసిన సంగతి తెలిసిందే. అన్నీ తానై వ్యవహరించి నిర్ణయాలు తీసుకున్న మాజీ సిఎం కెసిఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులూ బాధ్యులని నివేదిక తేల్చింది. ఈనేపథ్యంలో సిఎం, డిప్యూటీ సిఎం, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్, ఇతరులు మీడియాతో మాట్లాడుతూ పాత బీఆర్‌ఎస్ సర్కారుతోపాటు అప్పటిపాలకవర్గానిదే బాధ్యత అంటూ విమర్శలకు దిగారు. నివేదిక సర్కారుకు అందిన వెంటనే అది తప్పులతడక, అబద్దాల పుట్ట అంటూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన హరీష్‌రావు, తాజాగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును కలిశారు. పూర్తిస్థాయి కమిషన్ నివేదిక కాపీ ఇవ్వాలంటూ తన తరపున, కేసీఆర్ తరపున వినతిపత్రాలు సమర్పించారు. దీనిపై అసెంబ్లీలో మాటల యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదు. ఇందుకోసం పంద్రాగస్టు తర్వాత వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించడం ద్వారా బీఆర్‌ఎస్‌ను ప్రజల్లో దోషిగా నిలపాలనే వ్యూహంతో సర్కారు కదలికలు ఉన్నాయి. వాటిని అడ్డుకునేందుకు కేసీఆర్ రంగం సిద్ధం చేసుకుంటున్నారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఆ పార్టీ నేతలతో సమాలోచనలు చేస్తున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో జలరాజకీయం మరింత వేడెక్కనుంది. ఇందుకు అసెంబ్లీ వేదిక కానుంది. అయితే ఈ నివేదికపై పోలీసు 'సిట్' ఏర్పాటు చేయాలా? పిసి ఘోష్ కమిషన్ రిపోర్టు ఆధారంగానే బాధ్యులపై కేసులు పెట్టి చర్యలకు దిగాలా? అనే మీమాంసలో ప్రస్తుతం సర్కారు ఉంది. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లోగా తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతు భరోసా, ఇతర పథకాల అమలుతో ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత కొంత తగ్గిందనే భావన సర్కారులో నెలకొంది. బీసీ రిజర్వేషన్లను కేంద్రం అనుమతించకపోతే, పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలుచేయడం ద్వారా పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలని రేవంత్ సర్కారు భావిస్తున్నది. ఈ ఎన్నికలకు ముందే కాళేశ్వరం నివేదిక ఆధారంగా అరెస్టులు ప్రారంభిస్తే నష్టపోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వస్తున్నాయి. అసలు బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్‌ను ముట్టుకునే దమ్ముందా అనే రాజకీయ సవాళ్లు సైతం వినిపిస్తున్నాయి. కాళేశ్వరంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన తెలంగాణ, అదే ప్రాజెక్టుతో మళ్లీ వార్తల్లో నిలిచే పరిస్థితులు ఏర్పడవచ్చని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కెటిఆర్ న్యాయవాదులు లీగల్ నోటీస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తరపు న్యాయవాదులు లీగల్ నోటీసు పంపారు. ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని, నిరాధారమైనవని, అవి తన ప్రతిష్టను దిగజార్చే ఉద్దేశంతో చేసినవని లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 8న బండి సంజయ్ నిర్వహించిన పత్రికా సమావేశంలో చేసిన ఆరోపణలపై కెటిఆర్ ఈ నోటీసును పంపించారు.బండి సంజయ్ చేసిన ఆరోపణలు నిరాధారమైనవని, దురుద్దేశ పూరితమైనవని కేటీఆర్ తరపు న్యాయవాదులు ఆ నోటీసులో పేర్కొన్నారు. బండి సంజయ్ తన హెూదాను దుర్వినియోగం చేస్తూ, ప్రజల్లో కేటీఆర్ ప్రతిష్టను దిగజార్చడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేవలం రాజకీయంగా వార్తల్లో నిలిచేందుకు అడ్డగోలుగా బండి సంజయ్ పదేపదే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని న్యాయవాదులు తెలిపారు. టెలిఫోన్ ట్యాపింగ్ ఆరోపణలతో కెటిఆర్ ప్రతిష్టకు భంగం కలిగిందనీ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో పాటు ఆ తర్వాత మంత్రిగా కేటీఆర్ అనేక రంగాల్లో అద్భుతమైన సేవలందించారనీ, అయితే బండి సంజయ్ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలతో తన క్లైంట్ కేటీఆర్ పరువుకి భంగం కలుగుతున్నదని నోటీసులో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో బండి సంజయ్ చేసిన ఏ వ్యాఖ్యలకు కూడా ఎలాంటి సాక్ష్యాధారాలు లేవనీ, ఒక పార్లమెంటు సభ్యునిగా కేంద్ర మంత్రిగా బాధ్యత కలిగిన పదవుల్లో ఉండి మరొక శాసనసభ్యుడుపై అసత్యమైన, అడ్డగోలు వ్యాఖ్యలు చేశారని లీగల్ నోటీసులు న్యాయవాదులు ప్రస్తావించారు. బండి సంజయ్ చేసిన ఆరోపణలకు ఎలాంటి ఆధారం లేదనీ, ఇవి కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే చేశారని నోటీసులో స్పష్టం చేశారు.

జిఓ 17ను రద్దు చేయాలి

- గురుకులాలు, కెజిబివిల్లో ఫుడ్ కాంట్రాక్టర్లను మార్చే కుట్ర
- లక్ష మంది జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం : ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిరు వ్యాపారుల పొట్టకొట్టే జిఒ 17ను రద్దు చేయాలని బిఆర్‌ఎస్ నేత డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ జిఒను కేవలం బడా కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ నేతల కోసమే తెచ్చారని ఆయన ఆరోపించారు. దీంతో 20 వేల మంది గురుకులాలు, కెజిబివిల్లో ఫుడ్ కాంట్రాక్టర్ల కుటుంబ సభ్యులు లక్ష మంది జీవనోపాధి కోల్పోయి రోడ్డుపై పడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జిఒ 17 తెచ్చి రూ.600 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. ఫుడ్ కాంట్రాక్టర్లు రూ.50 లక్షలు ఇఎండి చెల్లించాలని, మండలం ఒక యూనిట్‌గా బడా కాంట్రాక్టర్లకు అప్పగించే కుట్ర చేశారని మండిపడ్డారు. టెండర్ అప్లికేషన్‌కు రూ.ఐదు వేల నుంచి రూ.25 వేల రూపాయలు వసూలు చేస్తున్నారని తెలిపారు. కోడి గుడ్లు సరఫరా చేసేందుకు రూ.3 కోట్ల టర్న్ ఓవర్ ఉండాలనే నిబంధన బడా కాంట్రాక్టర్ల కోసమే పెట్టారన్నారు. గతంలో కోడిగుడ్డు రేటు మార్కెట్ రేటు కంటే 30 పైసలు ఎక్కువగా ఉంటే దాన్ని రూ.7గా నిర్ణయించారని తెలిపారు. చిరువ్యాపారులకు అర్థం కాకుండా టెండర్ నిబంధనలు ఇంగ్లీష్‌లో రాసి ఆన్‌లైన్‌లో పెట్టారని తెలిపారు. కాంట్రాక్టర్ల నుంచి బ్యూరోక్రాట్లు, కాంగ్రెస్ నేతలు కమిషన్లు వసూలు చేస్తున్నారని తెలిపారు.

కలెక్టర్లు ,అదనపు కలెక్టర్ల కమీషన్ల పై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే సిఎస్‌ను కలిసి ఆ ఆధారాలు సమర్పించనున్నట్టు హెచ్చరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేవెళ్ల డిక్లరేషన్‌లో 25 శాతం దళితులకు కాంట్రాక్టులు ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక అంతకుముందు దళితులకు ఉన్న రాయితీలు, కాంట్రాక్టులు వారి నుంచి లాక్కుంటుందని విమర్శించారు. జిఒ 17 రద్దు కోసం బిఆర్‌ఎస్ ఉద్యమిస్తుందని, న్యాయపోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునే ఖర్గే, దళిత మంత్రులు ఎక్కడ ఉన్నారు? అని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ నేత అభిలాష్ రంగినేని, గురుకులాలు, వివిధ స్కూళ్ల ఫుడ్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రాజగోపాల్ రెడ్డి

అప్పుడు తెలీదా అన్నదమ్ములం ఉన్నామని..?

- సమీకరణలు ఎందుకు కుదరడం లేదు?
- ఉమ్మడి ఖమ్మంకు ముగ్గురు మంత్రులున్నప్పుడు.. నల్లగొండకు ఉంటే తప్పా..
- మరోసారి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"నన్ను పార్టీలోకి తీసుకున్నప్పుడు తెలియదా మేము ఇద్దరం అన్నదమ్ములం ఉన్నాం అని?.. ఇద్దరమూ దమ్మున్నోళ్లమే.. సమర్థులమే.. అలాంటప్పుడు ఇద్దరికి మంత్రి పదవులు ఇస్తే తప్పేంటి? తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పుడు.. 11 మంది ఎమ్మెల్యేలు ఉన్న నల్లగొండ జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండటంలో తప్పేంటి?" అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మరోసారి కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని ఎలగలగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ నెలికంటి సత్యంతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 'నాకు అన్యాయం జరిగితే పర్వాలేదు కానీ మునుగోడు ప్రజలకు అన్యాయం చేయొద్దని గత ప్రభుత్వానికి చెప్పినా.. ఇప్పుడూ చెప్తున్నా.. మీరు మంత్రి పదవి ఇస్తానని మాటిచ్చారు.. ఇచ్చినప్పుడు ఇవ్వండి కానీ అప్పటివరకు రూపాయి కూడా ఆపకుండా మునుగోడు అభివృద్ధికి సహకరించాలి" అని ప్రభుత్వానికి సూచించారు. ఇస్తామన్నమాట ఆలస్యమైంది.. సమీకరణాలు కుదరటం లేదు అంటున్నారు.. ఎందుకు కుదరటం లేదు సమీకరణలు.. ఎవరడ్డుకుంటున్నారు రాకుండా ? అని ప్రశ్నించారు. 'ఒడ్డు దాటే వరకు ఓడ మల్లయ్య.. ఒడ్డు దాటాక బోడి మల్లయ్య' అన్న చందంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఉందని అన్నారు. ఆలస్యమైనా సరే తాను ఓపిక పడుతున్నానని, ఈ ప్రాంతానికి అన్యాయం చేయొద్దని కోరారు. నల్లగొండ జిల్లాలోనే మునుగోడు నియోజకవర్గం వెనుకబడి ఉందని చెప్పారు. ఏ పదవి ఇచ్చినా మునుగోడు ప్రజల కోసమే కానీ తన కోసం కాదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ.. నూతన గ్రామ పంచాయతీ భవనం ద్వారా గ్రామస్తుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు వీలవుతుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షులు మిరియాల వెంకన్న, మాజీ సర్పంచ్ సురిగి చలపతి, నాయకులు వేమిరెడ్డి జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

నాట్కో ఫార్మాకు రూ.480 కోట్ల లాభాలు

హైదరాబాద్ : ప్రముఖ ఔషధ ఉత్పత్తుల కంపెనీ నాట్కో ఫార్మా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో 28 శాతం తగ్గుదలతో రూ.480.3 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.668.5 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.1,410.7 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో 1.42 శాతం తగ్గి రూ.1,390.6 కోట్లుగా చోటు చేసుకుంది. క్యూ1 ఫలితాల సందర్భంగా రూ. రెండు ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.రెండు మధ్యంతర డివిడెండ్‌ను అందించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు.

నిరంకుశ పాలకులపై తల్వార్ ఆళ్వార్ స్వామి

ప్రజాశక్తి కల్చరల్

భూస్వాముల నిరంకుశ పాలకుల పట్ల తల్వార్ ఆళ్వార్ స్వామి అని విఖ్యాత కవి దాశరథి కష్ణమాచార్య అభివర్ణించారని సిబిఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగ మారుతి శర్మ గుర్తు చేశారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వాహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా వట్టి కోట ఆళ్వార్ స్వామి యాది లో పేరిట సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ నాగ మారుతి శర్మ పాల్గొని మాట్లాడుతూ నిరుపేద బ్రాహ్మణ కుటుంబంలో తెలంగాణ మారు మూల గ్రామం లో పుట్టిన ఆళ్వార్ స్వామి స్వామి హెూటల్ కార్మికునిగా గోల్కొండ పత్రికలో ప్రూఫ్ రీడర్‌గా పని చేస్తూ నాటి సామాజిక ఆర్థిక రాజకీయ పరిస్థితులు అర్థం చేసుకున్నారని వివరించారు. ఒక చేత నిరంకుశ పాలకుల భూస్వాములకు వ్యతిరేకం గన్ను మరోచేత్తో పెన్ను పట్టి తెలంగాణ సాయుధ పోరాటం పాల్గొని దాశరథితో పాటు జైలు శిక్ష అనుభవించారని చెప్పారు. తెలంగాణ ప్రజలకు విజ్ఞానం అవసరం అని గ్రహించి ఊరూరా గ్రంథాలయ స్థాపనకి కృషి చేయడంతో పాటు దేశోద్ధారక గ్రంథ మాల స్థాపించి నాటి రచయితల రచనలు ప్రచురించిన తెలంగాణ నవ యుగ వైతాళికుడు ఆళ్వార్ స్వామి అని తెలిపారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ ఆళ్వార్ స్వామి పేరు కేంద్ర గ్రంథాలయంకు పెట్టటం సముచితంగా ఉందని ఆయన పేరిట ప్రభుత్వం అవార్డ్ ఏర్పాటు చేసి ఆయనపేరు రాబోయే తరాలు గుర్తు చేసుకునీ లాగా చేయాలి అని కోరారు. రచయిత్రి శైలజ మిత్ర మాట్లాడుతూ ఆళ్వార్ స్వామి తెలంగాణ ప్రజల జీవితం సాయుధ పోరాటం తెలిపే ప్రజల మనిషి గంగు నవలలతో పాటు పలు కథలు నాటకాలు రాసారు అని పేర్కొన్నారు. వేదికపై నటుడు మాణిక్ వందే భారత్ సినీ దర్శకుడు మల్లం రమేష్ పాల్గొన్నారు.

'ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్'లో ప్రమాదం

- కార్మికుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం తెల్లవారుజామున మొదటి షిఫ్ట్‌లో ప్రమాదం జరిగి ఒకరు మృతిచెందారు. గుట్ట రూరల్ ఎస్ఐ బి.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన సదానందం(50) ఇరవై ఏళ్ల నుంచి ఆలేరు మండలం పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో పనిచేస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున మొదటిషిఫ్ట్‌కు వచ్చిన సదానందం బాంబుల తయారీకి సంబంధించి ప్రదేశంలో ఉండే భారీ స్టీం పైపు మూతను తీసేందుకు యత్నించాడు. అది బలంగా వెనక్కి వచ్చి ముఖానికి తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

భువనగిరి ఏరియాస్పత్రిలో సదానందం మృతదేహాన్నిఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో తరచూ ఇలాంటి ప్రమాదాలు జరగడం బాధాకరమన్నారు. కంపెనీ యాజమాన్యం జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మిషనరీని పర్యవేక్షించి కొత్త టెక్నాలజీ మిషనరీ ఇంప్లిమెంట్ చేయాలని చెప్పారు. మృతిచెందిన కార్మికుని కుటుంబాన్ని కంపెనీ యజమాన్యం ఆదుకోవాలని కోరారు. ఈ ప్రమాదం పట్ల ప్రత్యేక దర్యాప్తు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కందుకూరు మాజీ సర్పంచ్ బీమగాని రాములు, నాయకులు పెంటయ్య ఉన్నారు. కార్మికుడు సదానందం మృతి పట్ల సిపిఎం నాయకులు,సిఐటియు నాయకులు సీహెచ్.రమేష్, జోగు శ్రీను, నరేష్, జమ్మూ, రాజశేఖర్, కాలే స్వామి సంతాపం తెలిపారు.

వైద్యురాలి నిర్లక్ష్యం!

- గర్భిణిని చెకప్ చేయకుండానే రాసిన మందులు
- ఇంటికెళ్లాక ప్రసవం.. శిశువు మృతి
- ఆస్పత్రి ఎదుట బాధిత బంధువుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కడుపు నొప్పితో ఆస్పత్రికి వచ్చిన ఏడు నెలల గర్భిణిని వైద్యురాలు ప్రత్యక్షంగా పరిశీలించకుండానే ఫోన్‌లో మందులు సూచించడంతో.. శిశువు మృతిచెందిందంటూ బాధిత కుటుంబీకులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని ప్రిన్స్ ఆస్పత్రిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట యాదగిరిపల్లికి చెందిన ప్రశాంత్ భార్య తేజస్విని ఏడు నెలల గర్భిణి. కడుపు నొప్పి రావడంతోపాటు కాళ్లు గుంజుతున్నాయని సోమవారం ప్రిన్స్ వైద్యశాలకు వెళ్లారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో అక్కడ ఉన్న నర్సు తేజస్వినికి సంబంధించిన రిపోర్టులను మొబైల్ ద్వారా డాక్టర్‌కు పంపించింది. ఫోన్‌లో రిపోర్టులు చూసిన డాక్టర్.. గర్భిణిని ప్రత్యక్షంగా పరిశీలించకుండానే పలురకాల మందులు వాడాలని సూచించారు. ఆ మందులు వాడిన తర్వాత మళ్లీ మరుసటి రోజు ఆస్పత్రికి రావాలని నర్సు చెప్పింది. అయితే, ఇంటికి వెళ్లాక తేజస్వినికి రక్తస్రావం అయింది. పాప పుట్టింది. వెంటనే కుటుంబీకులు మరో ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే శిశువు మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. దాంతో ప్రిన్స్ ఆస్పత్రి డాక్టర్ సూచించిన మందులు వాడడంతోనే శిశువు మృతిచెందిందని ఆరోపిస్తూ బాధిత కుటుంబీకులు మంగళవారం ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

మొదట్లో ఫస్ట్‌సీట్.. మెల్లగా లాస్ట్ సీట్

- బిజెపిలో చేరేముందు ఆలోచించండి
- ఆ పార్టీలో కొందరు రాక్షసులున్నారు : రాజాసింగ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పార్టీలో చేరిన మొదట్లో ఫస్ట్ సీటులో కూర్చోబెట్టి మెల్లగా లాస్ట్‌సీట్‌లోకి తోసేయడం రాష్ట్ర బిజెపి నేతల తీరనీ, ఆ పార్టీలో చేరే ముందుకు ప్రతి ఒక్కరూ ఆలోచించాలని ఎమ్మెల్యే రాజాసింగ్ సూచించారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ బిజెపిలో కొంత మంది రాక్షసులున్నారని మరోమారు తీవ్రస్థాయి వ్యాఖ్యలు చేశారు. ఈ రోజుకాకపోయినా రేపైనా ఆ రాక్షసులు నాశనం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. 'పార్టీలో చేరే ముందు కొన్ని మాటలు యాదిలో పెట్టుకోండి. మరికొన్ని రాసిపెట్టుకోండి. బిజెపిలోకి వచ్చే ముందు కొందరితో చర్చించి ఆ తర్వాత చేరండి. నాగం జనార్ధన్‌రెడ్డి, విజయశాంతి, జితేందర్‌రెడ్డి ఎందుకు బిజెపి నుంచి వెళ్లిపోయారో ఆలోచించండి. ఆ పార్టీలో చేరాక మీరు అనుకున్నది మీ నియోజకవర్గాల్లో జరుగదు. మీతోపాటు చేరిన కార్యకర్తలకు మీరు ఏ పదవీ ఇప్పించలేరు. మీకే టికెట్ వస్తుందన్న గ్యారంటీ ఉండదు' అని బిజెపిలో చేరబోతున్న నేతలను హెచ్చరించారు.

సింగర్ సిద్ శ్రీరామ్ ఇక సింగింగ్ టూర్

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రముఖ గాయకుడు సిద్ శ్రీరామ్ తన మొట్టమొదటి మల్టీ సిటీ ఇండియన్ టూర్‌తో తన అభిమానులను, సంగీత ప్రేమికులను మంత్రముగ్ధులను చేయనున్నారు. సిద్ లైవ్ మ్యూజిక్ కన్సర్ట్ పేరుతో నవంబర్ 22న బెంగళూరు, నవంబర్ 29న చెన్నైలో, డిసెంబర్ 13న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించనున్నామని సిద్ శ్రీరామ్ తెలిపారు. ఈ కన్సర్ట్‌లో 15 వేల మందికిపైగా హాజరవుతాయని అంచనా వేశారు. తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషలలో 250కి పైగా పాటలతో సిద్ శ్రీరామ్ అలరించారు.



తనిఖీలు చేస్తున్న రైల్వే జిఎం

మౌలాలీ డిపోలో ద.మ.రైల్వే జిఎం తనిఖీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం మౌలా-అలీలోని ట్రైన్ సెట్ మెయింటెనెన్స్ డిపోను తనిఖీ చేశారు. ఈ సమయంలో ఆయనతో పాటు హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. డిపోలో చేపడుతున్న వందే భారత్ రైళ్లు, ఎంఎంటీఎస్, ఈఎంయూల తనిఖీ, నిర్వహణ షెడ్యూల్‌లను సమీక్షించారు. వందే భారత్ రైలును తనిఖీ చేసి, కొనసాగుతున్న నిర్వహణ కార్యకలాపాలన సమీక్షించారు. జనరల్ మేనేజర్ డిపోలో ఇతర సౌకర్యాలు, వాటిలో పిట్ వీల్ లేత్, ఫ్లాష్ బట్ వెల్డింగ్ ప్లాంట్లను తనిఖీ చేసి కార్యాచరణ సామర్థ్యాన్ని అంచనా వేశారు. జనరల్ మేనేజర్ పర్యావరణ హిత వాతావరణాన్ని ప్రోత్సహించడానికి మొక్కలు నాటారు. అధికారులతో తదుపరి అభివద్ధి ప్రణాళికలపై చర్చించారు.